సాక్షి
కామారెడ్డి
సోమవారం । 1 । సెప్టెంబర్ । 2025



రికార్డులు సృష్టించిన వరదలు

నిజాంసాగర్ ప్రాజెక్టుకు 13 రోజుల్లో 91.323 టీఎంసీల ఇన్‌ఫ్లో రాగా.. 78.770 టీఎంసీలు విడుదల చేశారు.

- 8లో ▸



ముందస్తు చర్యల్లేకే తీవ్ర నష్టం

ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుని ఉంటే ఇంత నష్టం జరిగేది కాదని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పేర్కొన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
33.8 /21.9

ఉదయం చల్లటి గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

తాత్కాలిక మరమ్మతులు పూర్తి



నాగిరెడ్డిపేట: కోతకు గురైన పోచారం ప్రాజెక్టు కట్టకు తాత్కాలిక మరమ్మతులు ఆదివారం పూర్తయ్యాయి. భారీ వరదలతో ఐదురోజుల క్రితం ప్రాజెక్టు అలుగుకు ఒకవైపు మట్టి కొట్టుకుపోయి కోతకు గురైన విషయం తెలిసిందే. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశాలతో స్థానిక నాయకులు ముందుకు వచ్చి అధికారుల సహకారంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. కోతకు గురైన ప్రాంతంలో ట్రాక్టర్లతో మట్టిని పోయించారు. ఇసుకబస్తాలను అడ్డుగా వేయించారు.

తగ్గిన వరద

పోచారం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. శనివారం సాయంత్రం వరకు 6 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా ఆదివారం సాయంత్రానికి 2 వేల క్యూసెక్కులకు తగ్గిపోయింది. అలుగుపైనుంచి 2 వేల క్యూసెక్కుల నీరు మంజీర నదిలోకి వెళ్తోంది.

టీపీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక



కామారెడ్డి అర్బన్: పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా అంబీర్ మనోహర్‌రావు, జనపాల లక్ష్మీరాజం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని దేవీవిహార్‌లోగల పీఆర్టీ యూ తెలంగాణ కార్యాలయంలో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయ సమస్యలపై చర్చించిన అనంతరం పలు తీర్మానాలు చేశారు. అనంతరం ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా ఎం.నర్సింగరావు, టి.ప్రభాకర్ వ్యవహరించారు. ఎన్నిక అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ వ్యవస్థాపక అధ్యక్షుడు జి.హర్షవర్ధన్ రెడ్డి నాయకత్వంలో ముందుకు పోతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు లెనిన్, రమణ, సురేందర్, సురేష్, నరేష్, సూర్య, ఎల్లాగౌడ్, వెంకట్, ఆనంద్, నర్సింలు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాగులో పాము



బ్యాగ్‌లో ఉన్న పాము

భిక్కనూరు : విద్యుత్ శాఖలో పనిచేసే ఓ ఉద్యోగి బ్యాగులో ఆదివారం పాము ప్రత్యక్షమైంది. దాన్ని చూసి సిబ్బంది కంగుతిన్నారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కాచాపూర్ గ్రామ సబ్ స్టేషన్ పరిధిలో జేఎల్‌ఎంగా పనిచేస్తున్న సంజీవ్ తన విద్యుత్ శాఖకు సంబంధించిన పరికరాల బ్యాగును స్థానిక సబ్‌స్టేషన్‌లో ఉంచారు. ఆదివారం గ్రామంలో విద్యుత్ సమస్య రావడంతో ఆయన సామగ్రి కోసం సబ్ స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ బ్యాగు తెరుస్తుండగా పాము బయటకు వచ్చింది. దాన్ని చూసిన సంజీవ్ షాక్‌కు గురై అరుస్తూ పరుగులు తీశారు. వెంటనే సబ్ స్టేషన్‌లో పనిచేసే ఇతర సిబ్బంది, స్థానికులు వచ్చి పామును చంపేశారు.

రేపటినుంచి మళ్లీ వర్షాలు కురిసే అవకాశాలు

కామారెడ్డి క్రైం: వాతావరణ శాఖ అంచనాల ప్రకారం మంగళవారం నుంచి జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే జిల్లాలో అధిక వర్షాల కారణంగా కలిగిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మళ్లీ భారీ వర్షాలు కురిస్తే గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అధికారులు క్షేత్రస్థాయిలో చురుగ్గా వ్యవహరించాలన్నారు. ముంపునకు గురయ్యే ప్రాంతాలు, ఉప్పొంగే ప్రాజెక్టులు, చెరువులు, ప్రమాదకరంగా ప్రవహించే వాగులు, శిథిలావస్థకు చేరిన ఇళ్లు, భవనాలు, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు తదితర అన్నింటిని ముందుగానే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు పరిస్థితులను తెలియజేయాలని ఆదేశించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి జిల్లా అధికార యంత్రాంగానికి సహకరించాలని కోరారు.



జీఆర్ కాలనీలో నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న కామారెడ్డి పట్టణ సీఐ నరహరి, సిబ్బంది(ఫైల్)

మేమున్నామని.. మీకేం కాదని..

- వరదల్లో ప్రజలకు అండగా నిలిచిన పోలీసు యంత్రాంగం
- జిల్లాలో 775 మందిని రక్షించిన రెస్క్యూ బృందాలు
- సేవలను ప్రశంసిస్తున్న జిల్లావాసులు

భారీ వర్షాలు, వరదలతో ఊహించని విపత్తును ఎదుర్కొన్న జిల్లావాసులు అష్టకష్టాలు పడ్డారు. వరద ప్రభావిత ప్రాంతాలలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని గడిపారు. పోలీసు, రెస్క్యూ బృందాలు చాలామందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. ప్రాణాలను లెక్కచేయకుండా శ్రమించి, బాధితులను రక్షించిన వారి సేవలపై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది.

– కామారెడ్డి క్రైం

జిల్లాలో మునుపెన్నడూ లేని విధంగా భారీ వర్షాలు కురియడంతోపాటు ఊహించని విధంగా వరదలు వచ్చాయి. దీంతో చాలా ప్రాంతాలు నీట మునిగాయి. వరదలు జిల్లాలోని అన్ని ప్రాంతాల ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేశాయి. ప్రధానంగా జిల్లా కేంద్రం భారీ వరదలకు కకావికలమైంది. ఇలాంటి విపత్తు సమయంలో జిల్లా పోలీసు యంత్రాంగం ప్రజలకు అండగా నిలిచింది. వరదల్లో చాలామంది పోలీసులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధుల్లో పాల్గొని ప్రజలను కాపాడి, సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఎస్పీ రాజేశ్ చంద్ర సైతం వరదలు మొదలైన దగ్గర నుంచి స్వయంగా ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేస్తూ, సహాయక చర్యల్లో తలమునకలయ్యారు. విపత్తులో చిక్కుకున్న వందల మందిని సురక్షితంగా బయటకు చేర్చడంలో కృతకృత్యులయ్యారు.



గోర్గల్ గేటు పునరావాస కేంద్రంలో ఎస్పీ రాజేశ్‌చంద్రకు కృతజ్ఞతలు తెలుపుతున్న బాధితులు (ఫైల్)

ముందుండి నడిపించిన ఎస్పీ

పరిస్థితులు చేయి దాటుతున్నట్లు తెలియగానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాల్లో పోలీసు బృందాలు అప్రమత్తమయ్యాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని జీఆర్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీలు భారీ వరదలతో సగానికిపైగా నీట మునిగాయి. స్థానిక పోలీసులతో పాటు 35 మంది సభ్యుల చొప్పున ఉండే 3 ఎస్‌డీఆర్‌ఎఫ్, 100 మంది సభ్యులు గల ఎన్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక శాఖ బృందాలు రంగంలోకి దిగాయి. చెరువులు, వాగులు, కాలనీల్లో చిక్కుకున్న వారిని కాపాడారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని కాలనీల్లో ఇళ్లలో చిక్కుకున్న దాదాపు 500 మంది ప్రజలను పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరి ఆధ్వర్యంలో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టి సురక్షిత ప్రాంతాలకు తరలించిన తీరును ప్రతి ఒక్కరూ ప్రశంసిస్తున్నారు. ఈ ఆపరేషన్‌లో నడుము పైభాగం వరకు కొనసాగుతున్న వరద ప్రవాహంలోంచి జీఆర్, హౌసింగ్ బోర్డు కాలనీల ప్రజలను సీఐ, సిబ్బంది తమ భుజాలపై మోస్తూ ఇతర ప్రాంతాలకు తరలించారు. నిజాంసాగర్ మండలంలోని అన్నాసాగర్, గున్కుల్ గ్రామాలకు చెందిన ప్రజలు వాగులు, చెరువుల్లో చిక్కుకున్నారని తెలుసుకుని ఎస్పీ రాజేశ్ చంద్ర వెళ్తుండగా నర్వ వద్ద వాగు ప్రవాహం ఉధృతంగా మారింది. ఎందరు వద్దంటున్నా ప్రమాదకరంగా ఉన్న ప్రవాహంలోనూ పొక్లెయిన్‌పై ఎక్కి ఎస్పీ తన సిబ్బందితో కలిసి అవతలి ఒడ్డుకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టి వాగుల్లో చిక్కుకున్న వారిని కాపాడారు. జిల్లావ్యాప్తంగా చేపట్టిన రెస్క్యూ ఆపరేషన్‌లో వరదల్లో చిక్కుకున్న మొత్తం 775 మందిని పోలీసు యంత్రాంగం కాపాడింది. రోడ్లు దెబ్బతిన్న అన్ని ప్రదేశాల్లో ఇప్పటికీ దారి మళ్లింపు, భద్రత విధులు చేపడుతూ జాగ్రత్త చర్యలు కొనసాగిస్తున్నారు.

కష్టపడిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు



వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడడంలో, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో పోలీస్ అధికారులు, సిబ్బంది, ఫైర్ సిబ్బంది, ప్రత్యేక బృందాలు విశేషంగా కృషి చేశాయి. వీరితోపాటు విపత్కర సమయంలో వలంటీర్లుగా పని చేసిన వారికి, పోలీసులకు సహకారం అందించిన వారందరికీ ధన్యవాదాలు.

– రాజేశ్ చంద్ర, ఎస్పీ

ప్రధాన ఘటనలు..

- నిజాంసాగర్ మండలం అన్నాసాగర్ శివారులో వాగులో చిక్కుకున్న 9 మందిని పోలీసులు, సహాయక బృందాలు శ్రమించి ఒడ్డుకు చేర్చాయి.
- గున్కుల్ వద్ద వరదల్లో చిక్కుకుపోయిన ఇద్దరు చిన్నారులు సహా మొత్తం ఐదుగురిని కాపాడాయి.
- కామారెడ్డిలోని జీఆర్, హౌసింగ్ బోర్డు కాలనీల్లో ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక బృందాలతో కలిసి పట్టణ పోలీసులు 500 మందికిపైగా ప్రజలను భారీ వరదలోంచి సురక్షిత ప్రాంతాలకు తరలించారు.
- సరంపల్లి వద్దనున్న ఎస్టీ బాలుర హాస్టల్ నీట మునిగిపోతుండడంతో 300 మంది విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తీసుకువెళ్లారు.
- బీబీపేట మండలం యాడారంలో చెరువు కట్టపై చిక్కుకున్న 9 మంది రైతులను ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు కాపాడాయి.
- కల్యాణి ప్రాజెక్టుతోపాటు సమీపంలోని చెరువులకు గండ్లు పడి వరద నీరు భారీగా ప్రవహించింది. దీంతో మహ్మద్‌నగర్ మండలం బొగ్గు గుడిసె సమీపంలో హైవే రోడ్డు నిర్మాణం పనులు చేస్తున్న ఆరుగురు బిహార్‌కు చెందిన కూలీలు ఆ వరదలో చిక్కుకున్నారు. ట్యాంకర్ పైకి ఎక్కి ప్రాణాలను కాపాడుకున్నారు. వారిని ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాల సాయంతో స్థానిక పోలీసులు కాపాడారు.
- పాల్వంచ సమీపంలోని పంట పొలానికి వెళ్లిన తండ్రీకొడుకులు.. వాగు ప్రవాహం పెరగడంతో అక్కడే చిక్కుకుపోయారు. వారిని ఎన్‌డీఆర్‌ఎఫ్ బృంద సభ్యులు రక్షించి తీసుకువచ్చారు.
- వరదల్లో చిక్కుకున్న ఇద్దరిని గాంధారి ఎస్సై ఆంజనేయులు, సిబ్బంది స్థానికుల సహకారంతో కాపాడారు.
- ఎల్లారెడ్డి మండలం తిమ్మారెడ్డి శివారులో ఉన్న ఓ పౌల్ట్రీ ఫాంలో చిక్కుకుపోయిన ముగ్గురిని ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు కాపాడాయి.

'ఫసల్ బీమా యోజనను అమలు చేయాలి'



మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

భిక్కనూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా పథకం రాష్ట్రంలో అమలులో ఉండిఉంటే పంట నష్టపోయిన రైతులకు ఉపయోగపడేదని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఫసల్ బీమా యోజన అమలయ్యేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆయన బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులుతో కలిసి భిక్కనూరు మండల కేంద్రంతో పాటు అంతంపల్లి, లక్ష్మీదేవునిపల్లి, రామేశ్వర్‌పల్లి గ్రామాల్లో దెబ్బతిన్న పంటలు, రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదలతో పంటలు నష్టపోయినవారికి ఎకరాకు రూ. 50 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతులందరికి సంబంధించిన రూ. 2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేయాలన్నారు. ఆయన వెంట కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు రమేశ్, నాయకులు శ్రీనివాస్, నిరంజన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, లింగారెడ్డి, రాజయ్య, తిరుమలేష్, గణేష్ రెడ్డి, మల్లారెడ్డి విద్యాసాగర్‌రెడ్డి, భూపతి, వెంకటరెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'త్వరగా పంట నష్ట పరిహారం అందేలా చూడాలి'



బస్వన్నపల్లిలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ సంగ్వాన్

రాజంపేట: పంట నష్టం వివరాలను సేకరించి బాధిత రైతులకు త్వరగా పరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన రాజంపేట నుంచి ఆర్గొండకు వెళ్లే రోడ్డును పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాలతో దెబ్బతిన్న రోడ్డుకు ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టారు. మండలంలో దెబ్బతిన్న ఇళ్ల వివరాలను సేకరించి నివేదిక అందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఇనాంతండా వద్ద చేపట్టిన రోడ్డు మరమ్మతులను వేగవంతం చేయాలని, గ్రామాలలో ఎలాంటి పారిశుధ్య సమస్య రాకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట కామారెడ్డి ఆర్డీవో వీణ, ఆర్‌అండ్‌బీ ఈఈ మోహన్, మండల ప్రత్యేక అధికారి అపర్ణ, ఏడీఏ అపర్ణ, తహసీల్దార్ జానకి, ఎంపీడీవో బాలకృష్ణ తదితరులున్నారు.

ఎంత పని చేసింది పాడు వాన

- వరద బీభత్సంపై గళమెత్తిన కలాలు
- బాధితుల పరిస్థితిని కళ్లకు కట్టేలా రచనలు
- మానవత్వం చూపి బాధితులకు అండగా నిలవాలని పిలుపు
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పాటలు, వీడియోలు



కరీంనగర్ జిల్లాకు చెందిన కవి, గాయకుడు బుర్ర సతీష్ పాడిన పాట లక్షలాది గుండెలను తాకింది. 'ఎంత పనిచేసింది పాడు వాన.. కంటనీరు నింపె కామారెడ్డిలోనా..., పగవట్టి నట్టాయె సూడు వరద.. ప్రజల బతుకుల్లో కొట్టింది బురద, సాయమందించండి నేతలారా.. సావుబతుకుల్లో ఉన్నారు దాతలారా.. అంటూ పాడిన పాటలు విన్న వారంతా ఇక్కడి పరిస్థితులపై కంటతడి పెట్టారు.

తాడ్వాయికి చెందిన కవి కొడి రవీందర్ 'జడివానలో జడిసిన కామారెడ్డి' పేరుతో కవిత రాశారు. ప్రకృతికి ఎవరేం హాని తలపెట్టినారో.. ప్రజల నివాసాలపై జోరువాన రూపంలో పగబట్టింది.. జనజీవనాన్ని అతలాకుతలం చేసింది అంటూ ఆవేదనకు అక్షర రూపం ఇచ్చారు. ప్రకృతిని కాపాడుకోవాలని, మానవత్వంతో బతకాలని తన కవిత ద్వారా ప్రజలకు పిలుపునిచ్చారు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పండుగ పూట ఉరిమిన మేఘం సృష్టించిన విధ్వంసకాండను చూసిన కలాలు, గళాలు కంట తడిపెట్టాయి. కన్నీటి నుంచి రాలిన అక్షరాలనే కవితలు, పాటలుగా ప్రపంచం ముందుంచాయి. జిల్లా కేంద్రంలో వరదలు ఎందరి జీవితాలనో నాశనం చేసిన సంఘటనపై పలువురు కవులు, రచయితలు, గాయకులు తమ ఆవేదనను అక్షరరూపంలో వ్యక్త పరిచారు. ప్రకృతి సృష్టించిన బీభత్స కాండకు కారణాలపై కొందరు, ఆక్రమణలపై మరికొందరు కవితలు, పాటలు రాశారు. ఇవి జనాన్ని కదలిస్తూ వైరల్ అవుతున్నాయి. వాటిలో మచ్చుకు కొన్ని..

- ➔ కామారెడ్డికి చెందిన కవి, రచయిత వి.శంకర్ కామారెడ్డిలో వరదల విధ్వంసంపై తన మినీ కవితల ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. 'ప్రకృతి ప్రశ్నలు సంధిస్తున్నది మనిషీ.. నువ్వు మనగలుగుతావా? మట్టి కొట్టుకుపోతావా? పాతం ప్రశ్నార్థకమే?', 'ఓ పరమేశా! గంగను పిలు.. వరదలు చాలున్' అంటూ కవితలల్లారు.
- ➔ కామారెడ్డికి చెందిన కవి, గాయకుడు గఫూర్ శిక్షక్ ఇది కామారెడ్డి వేదన.. ప్రజల ఇబ్బందుల రోదన.. నీళ్లు నిండిపోయి ఇంట్లో చేరిపోయి.. చెరువు నిండిపోయి రోడ్లు తెగిపోయే.. ఎన్నెన్నో బాధలు, ఎన్నెన్నో కష్టాలు..' అంటూ పాట రూపంలో తన ఆవేదనను వ్యక్తం చేశారు.
- ➔ కామారెడ్డికి చెందిన కవి అల్లి మోహన్‌రాజ్ 'అబ్బబ్బ.. ఇదేం ఆన.. గిదేం ఆన.. ఊర్లని ముంచింది.. పంటలను ముంచింది.. యాడ సూసిన వరదలే' అంటూ తన కవితలో వివరించారు. సెరువులు, కుంటలు, వాగులు, నదులు ఒక్కటేమిటి అన్నీ కబ్జా సేసి ఇండ్లు కట్టి దబ్బు సంపాయించవట్రి.. అడ్డుజెప్పినోళ్లను బెదిరించవట్రి.. అయిందేదో అయ్యింది గీడికెళ్లన్న తప్పుల్ని సరిదిద్దుకుందం, మనుషుల తీర్గ బతుకుదాం' అంటారు.
- ➔ షెట్పల్లికి చెందిన బందరబోయిన శ్రీనివాస్ 'ఊరంతా సెరువవ్వగ కామారెడ్డి తల్లడిల్లిపోయెనో' అంటూ పాట రాశారు. పండగపూట బతుకులు ఆగమాయె. ఎప్పుడెరగని కష్టాల రోదనాయే అంటూ ప్రజల కష్టాలను తన పాటలో ఏకరువు పెట్టారు.
- ➔ కొండాపూర్‌కు చెందిన ఉపాధ్యాయుడు తిరుమల తిరుపతిరావు 'వరుణుడి కోపము తాండవించె ప్రభంజనములా ప్రజ్వరిల్లె కామారెడ్డి నగరం తల్లడిల్లె కుంభవృష్టిని కురిపించె' నంటూ పాట రాశాడు.
- ➔ తాడ్వాయికి చెందిన నర్సింలు 'భూమి చుట్టూ జలసిరి భుజాలపై బాలల ఊపిరి, భూమి ఏదో బుడగ ఏదో లోతు ఎంతనో తెలియదు.. లొంతాలు ఏవో తెలియవు.. మానవత్వమే మహోన్నతమైన రక్షణ కవచమంటూ, సహాయం చేసుకుంటూ మానవత్వాన్ని రక్షించుకుందాం రండి అని తన కవిత ద్వారా పిలుపునిచ్చారు.
- ➔ కాశ నర్సయ్య అనే కవి 'కుంభవృష్టి' అనే పాటలో ఉన్నాడా దేవుడొకడు ఉంటే ఈ బాధలెట్ల ఊర్లల్లో అని ఆవేదన వ్యక్తం చేశారు.

బాధితులకు సాయం అందేలా చూస్తాం

- ఎమ్మెల్సీలు విజయశాంతి, దయాకర్, వెంకట్, శంకర్‌నాయక్
- జిల్లా కేంద్రంలో పర్యటన
- కేంద్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేపై ఆగ్రహం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విజయశాంతి, పక్కన దయాకర్, శంకర్‌నాయక్, వెంకట్

కామారెడ్డి టౌన్: ''పేపర్లలో, టీవీలలో కామారెడ్డి వార్తలు విని, చూసి చాలా ఆవేదనకు గురయ్యాం. జీఆర్ కాలనీలో ఒక్కో బాధితుడు వరదల్లో మూడు రోజుల పాటు పడ్డ కష్టాలను వింటుంటే కన్నీళ్లు ఆగలేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి బాధితులకు సాయం అందేలా చూస్తాం'' అని ఎమ్మెల్సీ విజయశాంతి పేర్కొన్నారు. ఆదివారం ఆమె ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్, శంకర్‌నాయక్‌లతో కలిసి జిల్లా కేంద్రంలోని జీఆర్ కాలనీ, హౌసింగ్‌బోర్డు కౌండిన్య ఎన్‌క్లేవ్‌లలో పర్యటించారు. బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వరదల వల్ల కలిగిన నష్టాన్ని వివరించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. బాధితులకు భారీ నష్టపరిహారం లేదా ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి కూడా వరద బాధితులను ఆదుకునే విషయమై స్పందించకపోవడం సిగ్గు చేటన్నారు.

కామారెడ్డిలో రేవంత్‌రెడ్డి, కేసీఆర్‌లను కాదని బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తే ఇక్కడి ప్రజలను దోషులుగా చేసి ఆయన మాట్లాడుతున్నారని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ విమర్శించారు. కామారెడ్డి వరద ఘటనపై శాసన మండలి చైర్మన్ అనుమతితో ప్రత్యేకంగా చర్చిస్తామన్నారు. లాస్ అసెస్‌మెంట్ కమిటీ(ఎల్‌ఏసీ) ఏర్పాటు చేసి అత్యధిక పరిహారం అందించేలా చూస్తామన్నారు. బాధితులకు న్యాయం చేసే బాధ్యత తీసుకుంటామని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పేర్కొన్నారు. వరదల వల్ల వాటిల్లిన నష్టంపై ప్రభుత్వానికి నివేదిక అందించి, బాధితులకు అండగా నిలుస్తామని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ పేర్కొన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, పీసీసీ జనరల్ సెక్రెటరీ గిరిజా షెట్కార్, నాయకులు ఉప్పల శ్రీనివాస్ గుప్తా, చంద్రకాంత్‌రెడ్డి తదితరులున్నారు.



జీఆర్ కాలనీలో నష్టాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీలు

క్లుప్తంగా

మొక్కజొన్న పంటలపై అడవి పందుల దాడి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి, చిన్నదేమిక లాన్ శివార్లలోని మొక్క జొన్న పంటపై అడవి పందులు దాడి చేసి ధ్వంసం చేసినట్లు రైతులు తెలిపారు. శనివారం రాత్రి తాడ్వాయికి చెందిన పంబల్ల యాదగిరికి చెందిన మొక్కజొన్న పంటపై దాడి ధ్వంసం చేశాయి. అధికంగా పెట్టుబడులు వెచ్చించి పంటలను సాగుచేస్తే చేతికి వచ్చిన మక్క పంటను అడవి పందులు వచ్చి ధ్వంసం చేయడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి అడివి పందుల బెడదను అరికట్టాలని, సర్వే చేయించి నష్టపరిహారం ఇప్పించాలని రైతు కోరుతున్నారు.

జాతీయ రహదారి మరమ్మతుల పరిశీలన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జిల్లా సరిహద్దులోని పోచారం సమీపంలో ధ్వంసమైన జాతీయ రహదారి వద్ద చేపట్టిన మరమ్మతు పనులను డీఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించారు. పనులను త్వరగా పూర్తిచేసి రాకపోకలను పునరుద్ధరించాలని వారికి డీఎస్పీ సూచించారు. అంతకుముందు పోచారం ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టు వద్ద మట్టి కొట్టుకుపోయి కోతకు గురైన ప్రాంతంలో చేపట్టిన పనులను పరిశీలించారు. ఇరిగేషన్ సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎల్లారెడ్డి సీఐ రాజిరెడ్డి, నాగిరెడ్డిపేట ఎస్సై భార్గవ్‌గౌడ్ ఉన్నారు.

అక్టోబర్ 11న ఎస్సీ ఎస్టీ ఉద్యోగ, ఉపాధ్యాయ మహాగర్జన



కామారెడ్డి అర్బన్: ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై అక్టోబర్ 11న హైదరాబాద్‌లో నిర్వహించే మహాగర్జనను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు కొంగల వెంకట్, యాదగిరి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక వరలక్ష్మి గార్డెన్‌లో సంఘ సమావేశం జరిగింది. ఎస్సీ ఎస్టీల్లో ఓపెన్ మెరిట్ అభ్యర్థులను రిజర్వేషన్‌లో పెట్టడం ద్వారా తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన చెందారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంగయ్య, ఆల్ ఇండియా బంజరా సేవాసంఘం ప్రధాన కార్యదర్శి మోతీసింగ్, ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకృతి పగబట్టింది

- రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుకను తోడేయడంతోనే ఊర్లోకి వరద
- తప్పు అక్రమార్కులు చేస్తే.. శిక్ష మాకా? అంటూ ప్రశ్నిస్తున్న సిర్‌పూర్ గ్రామస్తులు

మద్నూర్(జుక్కల్): నాలుగైదు రోజులుగా సిర్‌పూర్ గ్రామ ప్రజలు బిక్కుబిక్కుమంటూ పునరావాస కేంద్రాల్లో అవస్థలు పడుతూ కాలం వెళ్లదీస్తున్నారు. అసలు సిర్‌పూర్‌లో ఎందుకు ఇంత వరద నీరు వచ్చి చేరిందని శనివారం గ్రామస్తులతో మాట్లాడగా వారు పలు విషయాలను చెప్పారు. సిర్‌పూర్ గ్రామానికి అతి సమీపంలో మంజీర వాగు ప్రవహిస్తోంది. మంజీర వాగులో లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక ఉంది. సిర్‌పూర్ పక్కనే మంజీర వాగు ఉండడంతో ఆ శివారులోని భూములన్నీ ప్రతి ఏటా పంటలతో కళకళలాడుతాయి. కేవలం 20 ఫీట్ల లోతులోనే మూడు ఇంచుల ఫుల్ నీళ్లు ఉండడంతో రైతులు వరి, సోయాబీన్, మక్క పంటలను పండిస్తారు. కొందరు అక్రమార్కులు మంజీర వాగులో ఉన్న ఇసుక మీద కన్ను పడడంతో నిత్యం వందల సంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్లలో ఇసుకను హైదరాబాద్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు రాత్రికి రాత్రే తరలించడం మొదలు పెట్టారని గ్రామస్తులు తెలిపారు. గత పది సంవత్సరాలల్లో నిత్యం ఇసుక అక్రమ రవాణా జరుగుతూనే ఉందని, అక్రమార్కులతో అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం చేతులు కలపడంతో ఇసుక దందాను నిలువరించేవారు కరువయ్యారు.

అసలు కారణం ఇదే..

సిర్‌పూర్ గ్రామానికి సమీపంలోని మంజీర వాగులో గ్రామం వైపు ఇసుక మేటలు 50 ఫీట్ల వరకు ఎత్తులో ఉండేవని గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రతీ వర్షాకాలంలో నిజాంసాగర్ గేట్లు ఎత్తినప్పుడు, భారీ వర్షాలు కురిసినప్పుడు వరద ఒకే సారి వచ్చినా ముందుకు వెళ్లిపోయేవని వారు అన్నారు. గ్రామం వైపు ఉన్న ఎత్తు ఇసుక మేటలు కాపాడేవని వారు చెప్పారు. కాని ఇసుకాసురులు సిర్‌పూర్ వైపు మొత్తం ఇసుక మేటలను కొల్లగొట్టి తరలించడంతో ముంపునకు గురవుతున్నామని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.

42 ఏళ్ల కిందట ఒకసారి వరద..

సిర్‌పూర్ గ్రామానికి 42 ఏళ్ల కిందట వరదలు వచ్చాయని సిర్‌పూర్ గ్రామ వృద్ధులు తెలిపారు. 1983లో భారీ వర్షాల కారణంగా గ్రామస్తులందరిని డోంగ్లీ, మద్నూర్‌కు తీసుకువచ్చి పునరావాసం ఏర్పాటు చేశారని గ్రామస్తులు ఆ ఘటనను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం నాలుగు రోజులుగా సిర్‌పూర్ గ్రామ ప్రజలు మద్నూర్, డోంగ్లీ పునరావాస కేంద్రాల్లో గడుపుతున్నారు. అధికారులు, గ్రామస్తులు రెండు పూటలా కడుపునిండా భోజనం పెడుతున్నారు. ఇంట్లో ఉన్న వస్తువులు, పంటలు పూర్తిగా దెబ్బతిని సర్వం కోల్పోయామని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. జేబులో చిల్లి గవ్వ లేదని ఇంట్లో నీటిలో కొట్టుకుపోయాయని వారు రోదించారు. తమను ఆర్థికంగా ఆదుకోవాలని వారు కోరారు.



సిర్‌పూర్ వద్ద గల మంజీర వాగు(ఫైల్)



మద్నూర్ పునరావాస కేంద్రంలో సిర్‌పూర్‌వాసులు

ఇసుక వల్లే ఈ ప్రళయం



సిర్‌పూర్ నుంచి అక్రమంగా ఇసుకను తోడేయడంతోనే ఈ జల ప్రళయం సంభవించింది. ఊరికి రక్షణగా ఉండే ఇసుక మేటలను తవ్వేయడంతోనే వరద నీరు మా గ్రామానికి చొచ్చుకొని వస్తోంది. గతంలో ఎన్నడు ఇలాంటి ప్రళయం చూడలేదు. –వాగ్మారే మారుతి, సిర్‌పూర్

మాకెందుకు ఈ కష్టం



వరద నీరు మా ఇళ్లలోకి వచ్చి చేరింది. అధికారులు మాకు ఇక్కడికి తీసుకువచ్చారు. గ్రామ శివారులోని వాగులో ఇసుక ఖాళీ అవడంతో వరద మా గ్రామానికి వచ్చి చేరుతుంది. ఇసుకను తవ్విన వారు చేసిన పాపానికి మేము కష్టం అనుభవిస్తున్నాం. –భారతీబాయి, సిర్‌పూర్

బతుకుదెరువు కోసం అడవి బాట



కన్నాపూర్ గ్రామస్తులను సముదాయిస్తున్న ఎంపీడీవో నరేష్, ఎస్సై దీపక్‌కుమార్, ఇతర అధికారులు

- అడ్డుకున్న అటవీ శాఖ అధికారులు
- భారీ వర్షాలతో కన్నాపూర్ గ్రామస్తులకు ప్రతి ఏటా ఇబ్బందులు

లింగంపేట(ఎల్లారెడ్డి): భారీ వర్షాల కారణంగా తరుచూ ఇబ్బందులు పడుతున్నామని లింగంపేట మండలం కన్నాపూర్ గ్రామస్తులు ఆదివారం అడవి బాట పట్టారు. కొన్నేళ్లుగా భారీ వర్షాలతో కన్నాపూర్‌లోని ఇళ్లలో వరద నీరు వచ్చి చేరుతుందని, తమకు పునరావాసం కల్పించాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోవడంలేదని గ్రామానికి చెందిన మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ముంపు బారి నుంచి కాపాడుకోవడానికి ఎత్తైన ప్రాంతం కన్నాపూర్ శివారులోని అడవిలో చెట్లను నరికి గుడిసెలు వేసుకొని జీవిస్తామని మహిళలు తెలిపారు. తమను కాపాడే నాయకులు, అధికారులు రారని నిర్ణయించుకొని అటవీ ప్రాంతంలోని చెట్లను తొలగించి చదును చేసుకొని నివాసాలు ఏర్పాటు చేసుకుంటామని గ్రామస్తులు నిర్ణయించుకున్నట్లు తెలిపారు. దాంతో వందలాది మంది మహిళలు, పురుషులు అడవి బాట పట్టారు. ఈ విషయం తెలుసుకున్న అటవీ శాఖాధికారులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. అడవులు నరకవద్దని గ్రామస్తులకు నచ్చజెప్పడానికి ప్రయత్నించినా మహిళలు వినిపించుకోలేదు. తమకు రక్షణ కల్పించడానికి ఎవరూ రాలేదు కాని తమ బతుకులు తాము బాగుచేసుకుంటామంటే అటవీ శాఖ అధికారులు అడ్డుకోవడం సరికాదన్నారు. తమను అడ్డుకోవద్దని మొర పెట్టుకున్నారు. దీంతో అటవీ శాఖ అధికారులు, తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో నరేష్, ఎల్లారెడ్డి సీఐ రాజారెడ్డి, ఎస్సై దీపక్‌కుమార్‌లకు సమాచారం ఇచ్చారు. వారు అటవీ ప్రాంతానికి చేరుకొని గ్రామస్తులను సముదాయించారు. అక్రమంగా అటవీ ప్రాంతాన్ని నరకడం నేరమని సూచించారు. గ్రామస్తులకు సర్వే చేయించి లోతట్టు ప్రాంతం నుంచి ఎత్తైన ప్రాంతానికి తరలించడానికి ప్రభుత్వ భూమిని గుర్తించి కేటాయించడానికి ప్రయత్నిస్తామని చెప్పారు. సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సొంతూళ్లకు వరద బాధితులు



బస్సులో వెళ్తున్న వరద బాధితులు

మద్నూర్(జుక్కల్): వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఐదు రోజులుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో గడిపిన వరద బాధితులు ఆదివారం వారి ఊళ్లకు వెళ్లారు. మద్నూర్, డోంగ్లీలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఐదు రోజులుగా సుమారు 500 మందికి అధికారులు ఆశ్రయం కల్పించారు. ఆదివారం వరద బాధితులకు భోజనం, టిఫిన్, పండ్లు ప్యాకింగ్ చేసి వారితో పంపించారు. స్కూల్ బస్సులలో, ట్రాక్టర్‌ల ద్వారా డోంగ్లీ మండలంలోని సిర్‌పూర్, చిన్న టాక్లీ, పెద్ద టాక్లీ గ్రామాల ప్రజలు తరలివెళ్లారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న వరద బాధితులకు సాయం అందించిన ప్రతి ఒక్కరికి తహసీల్దార్ ముజీబ్ కృతజ్ఞతలు తెలిపారు.

బగలాముఖీ జన్మదిన వేడుకలు



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని బగలాముఖీ అమ్మవారి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. భక్తులు రేవంత్ అప్ప, సతీష్, వెంకటేశం, సాయినాథ్, శివరాజు, సతీష్ తదితరులున్నారు.

కాలువ కబ్జాలే కారణం



భిక్కనూరు - తలమడ్ల రైల్వేస్టేషన్ల మధ్య ధ్వంసమైన రైల్వే ట్రాక్‌కు మరమ్మతు పనులు (ఫైల్)

భిక్కనూరు: భారీ వర్షాలకు ఇటీవల భిక్కనూరు–తలమడ్ల రైల్వేస్టేషన్‌ల మధ్య రైలు పట్టాల ధ్వంసానికి తిప్పాపూర్ చెరువు అలుగు కాలువ ఆక్రమణలే కారణమని తెలుస్తోంది. మెదక్ జిల్లా క్యాట్రాల అటవీ ప్రాంతంలో కురిసిన వర్షం నీరు కాలువల ద్వార తిప్పాపూర్ చెరువులోనికి చేరుతుంది. తిప్పాపూర్ చెరువు అలుగు నీరు కాలువల ద్వార రామేశ్వర్‌పల్లి చెరువులోకి రైల్వే చిన్న బ్రిడ్జిలో నుంచి చేరుతుంది. అయితే తిప్పాపూర్ అలుగు నీరు కాలువ ఆక్రమణకు గురికావడంతో దాదాపుగా కుచించుకు పోయింది. భారీ వరద కాలువ ఉప్పొంగి ప్రవహించి రైలు కట్టను కోతకు గురిచేయడంతో రైలు పట్టాలు ధ్వంసమయ్యాయి. మూడ్రోజుల పాటు మరమ్మతుల అనంతరం శనివారం ట్రాక్ పనులు పూర్తయ్యాయి.

కాలువ వెడల్పు పెంచాలి



తిప్పాపూర్ చెరువు నుంచి రామేశ్వర్‌పల్లి చెరువులోకి వచ్చే అలుగు కాలువ గతంలో చాలా వెడల్పుగా ఉండేది. కాలువకు ఇరు పక్కల ఉన్న రైతులు కాలువ వెడల్పును తక్కువ చేసి పంటలను సాగు చేస్తున్నారు. వెంటనే కాలువ వెడల్పును పెంచితే ఇలాంటి ప్రమాదాలు జరుగవు. అలాగే రైల్వే ట్రాక్ కింద బ్రిడ్జి వద్ద ఉన్న పైప్‌లైన్ వెడల్పు పెంచడంతో పాటు మరికొన్ని చోట్ల బ్రిడ్జిలను నిర్మించాలి. – సిద్దరాములు, రైతు, తిప్పాపూర్

రికార్డులు సృష్టించిన వరదలు



మంజీర నదిలో పరవళ్లు తొక్కుతున్న సాగర్ జలాలు

- 13 రోజుల్లో నిజాంసాగర్‌లోకి 91.323 టీఎంసీల ఇన్‌ఫ్లో
- 78.770 టీఎంసీలు మంజీర పాలు

నిజాంసాగర్: సంగారెడ్డి, మెదక్ జిల్లాలతో పాటు కామారెడ్డి జిల్లాలోని ఎగువ ప్రాంతాల్లో దంచికొట్టిన వర్షాలలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వరప్రదాయని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఈ ఏడాది భారీ స్థాయిలో వరద నీరు వచ్చి చేరింది. గతంలో ఎప్పుడూ చూడని స్థాయిలో వచ్చిన వరదలు రికార్డులు సృష్టించాయి. ప్రాజెక్టులోకి ఈనెల 18 న ఇన్‌ఫ్లో ప్రారంభమైంది. 13 రోజుల్లోనే నిజాంసాగర్‌లోకి 91.323 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ఇదే సమయంలో ప్రాజెక్టు గేట్లను ఎత్తి 78.770 టీఎంసీల నీటిని మంజీర నదిలోకి వదిలారు. ఈ స్థాయిలో ఇన్‌ఫ్లో రావడం, నీటిని విడుదల చేయడం ప్రాజెక్టు చరిత్రలోనే రికార్డని అధికారులు పేర్కొంటున్నారు.

మూడు రోజుల్లోనే 34 టీఎంసీలు..

ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కొనసాగుతూనే ఉంది. ఈనెల 28 నుంచి 31 వరకు 34.296 టీఎంసీల వరద నీరు రావడం గమనార్హం. ఇదే సమయంలో 35.748 టీఎంసీల నీటిని మంజీర నదిలోకి వదిలేశారు. మూడు రోజులలో ఈ స్థాయిలో ఇన్‌ఫ్లో రావడం, నీటిని వదిలేయడం ప్రాజెక్టు చరిత్రలో మొదటిసారి కావడం గమనార్హం.

తొమ్మిదేళ్ల తర్వాత..

నిజాంసాగర్ ప్రాజెక్టులోకి తొమ్మిదేళ్ల తర్వాత ఒకరోజు గరిష్ట స్థాయిలో వరద నీరు వచ్చి చేరింది. గతంలో 2016 సంవత్సరంలో ఒకరోజులో గరిష్టంగా 2 లక్షల వరకు ఇన్‌ఫ్లో వచ్చింది. ఈనెల 28న గరిష్టంగా 2.5 లక్షల వరకు ఇన్‌ఫ్లో వచ్చింది. భారీ వరదలు రావడంతో ప్రాజెక్టుకు మరోవైపు ఉన్న 20 గేట్లను 36 ఏళ్ల తర్వాత ఎత్తాల్సి వచ్చింది.

నిజాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

నిజాంసాగర్: కర్ణాటక, మహారాష్ట్రల్లో కురుస్తున్న వర్షాలకు సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వస్తోంది. సింగూరు గేట్లను ఎత్తడంతో నిజాంసాగర్ ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 74,784 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో వస్తోందని అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 14 గేట్ల ఎత్తి 1,15,633 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టునుంచి నీటి విడుదల కొనసాగుతుండడంతో మంజీర నదిలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది.



వరద గేట్ల ద్వారా విడుదలవుతున్న జలాలు

ముందస్తు చర్యల్లేకే తీవ్ర నష్టం

మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

కామారెడ్డి క్రైం: కామారెడ్డిలో భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖాధికారులు ముందస్తుగానే సూచించారని.. ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటే ఇంత నష్టం జరిగేది కాదని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలు, వరదలపై మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆదివారం కామారెడ్డిలో మాట్లాడారు. కనీవినీ ఎరుగని రీతిలో వర్షాలు కురవడంతో కలిగిన నష్టానికి బీఆర్ఎస్ తరఫున విచారం వ్యక్తం చేశారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని జీఆర్, హౌసింగ్ బోర్డు కౌండిన్య కాలనీల్లో భారీ నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. బాధితులకు కనీసం మంచినీళ్లు దొరకడం లేదన్నారు. మంత్రి సీతక్క తూతూ మంత్రంగా పర్యటించి వెళ్లారని విమర్శించారు. అంతకంటే ఆమె చేసిందేమీ లేదన్నారు. ఒక్కో కుటుంబానికి అధికారులు ప్రకటించిన రూ.11,500 సర్వస్వం కోల్పోయిన వారికి ఏం సరిపోతాయన్నారు. ప్రతి బాధిత కుటుంబానికి కనీసం రూ.లక్ష ఆర్థిక సహాయం, పంటలు కోల్పోయిన రైతులకు ప్రతి ఎకరానికి రూ.25 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు నాణ్యమైన భోజనం, వసతులు కల్పించాలన్నారు. వరద బాధితులపై ఎమ్మెల్యే రమణారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని విమర్శించారు. వారిని ఆదుకోడానికి అన్ని వర్గాల వారు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నల్లవెల్లి అశోక్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కుంబాల రవి, పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీలు కృష్ణమూర్తి, నీరడి శంకర్, అధికార ప్రతినిధి బల్వంత్ రావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మెంగారం గ్రామానికి చెందిన కొమ్ముల శ్రీనివాస్ అనే వ్యక్తి ఆత్మహత్యకు యత్నించినట్లు గ్రామస్తులు తెలిపారు. శ్రీనివాస్ ఆదివారం పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్య యత్నానికి గల కారణాలు తెలియరాలేదు.

యూరియా 'బస్తా' మే సవాల్



భిక్కనూరులో యూరియా కోసం ఎగబడుతున్న రైతులు

భిక్కనూరు: మండలంలో యూరియా కొరత తీవ్రంగా ఉంది. భిక్కనూరు సొసైటీకి యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు ఆదివారం వేకువజామున 4 గంటల నుంచే క్యూ లైన్‌లో నిల్చున్నారు. ఉదయం 9 గంటలకు యూరియా విక్రయం ప్రారంభమైంది. క్యూలో నిల్చున్న రైతులకు ఎకరాకు ఒక బస్తా చొప్పున విక్రయించారు. 11 గంటల వరకు 460 బస్తాల విక్రయం పూర్తయింది. కొందరికి యూరియా దొరక్కపోవడంతో నిరాశతో వెళ్లిపోయారు.

మాచారెడ్డి: మాచారెడ్డి, పాల్వంచ మండలాల్లో యూరియా దొరక్క రైతులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. పాల్వంచ మండలం ఎల్పుగొండలో ఉన్న సొసైటీ గోదాంకు 200 బస్తాలు వచ్చాయి. ఈ విషయం తెలుసుకున్న ఎనిమిది గ్రామాల రైతులు ఎల్పుగొండకు వచ్చి క్యూలైన్‌లో నిల్చున్నారు. ఒక్క రైతుకు ఒక బస్తా చొప్పున పంపిణీ చేశారు.



ఎల్పుగొండలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

భక్తి శ్రద్ధలతో బొజ్జ గణపయ్యకు పూజలు



తాడ్వాయిలో ప్రత్యేక పూజలు చేస్తున్న యువకులు



తాడ్కోల్ బీడీవర్కర్స్ కాలనీలో సామూహిక కుంకుమార్చన

సాక్షి నెట్‌వర్క్:జిల్లా వ్యాప్తంగా మండపాల వద్ద బొజ్జ గణపయ్య పూజలు అందుకుంటున్నాడు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు పంచిపెట్టారు. పలుచోట్ల అన్నదానాలు చేశారు. పలు చోట్ల ఏర్పాటు చేసిన భిన్న రకాలైన గణేశ్ విగ్రహాలు ప్రజల్ని ఆకట్టుకుంటున్నాయి. మండపాల వద్ద చిన్నారుల సందడి నెలకొంది. కొన్ని చోట్ల భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



దేవునిపల్లి విద్యుత్‌నగర్ శ్రీగణేష్ మండలి మండపం వద్ద హోమం



ఎల్లారెడ్డి: టీచర్స్ కాలనీ గణేష్ మండలిలో అన్నదానం

క్రైం కార్నర్

ట్రాక్టర్ పైనుంచి పడి ఒకరి మృతి



నాగేంద్ర (ఫైల్)

బాల్కొండ: ట్రాక్టర్ పైనుంచి పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ముప్కాల్ మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై రజనీకాంత్ తెలిపిన వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పొట్టి శ్రీరాములు జిల్లా కొత్త పట్టణం మండలం గోవిందపల్లె గ్రామానికి చెందిన బుదురు నాగేంద్ర (23) కొన్ని నెలలుగా ముప్కాల్ మండలం నల్లూర్ శివారులోని ఇటుక బట్టీలో పనిచేస్తుండేవాడు. ఆదివారం అతడు తోటి కార్మికులతో కలిసి ట్రాక్టర్‌లో ఇటుక లోడ్ తీసుకొని మోర్తాడ్ మండలం శెట్‌పల్లికి వెళ్లాడు. అన్‌లోడ్ అనంతరం తిరిగి అదే ట్రాక్టర్‌పై ఇటుక బట్టీకి బయలుదేరారు. నాగంపేట్ శివారులో డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా అతడు ట్రాక్టర్ పైనుంచి కిందపడిపోయాడు. ఈఘటనలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు..

మాచారెడ్డి: చెరువులో చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొని మృతిచెందాడు. ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు .. పాల్వంచ మండలం పోతారం గ్రామానికి ఇప్పలవాయి నారాయణ(70) అనే వృద్ధుడు శనివారం సాయంత్రం చేపల వేటకని గ్రామంలోని ఊర చెరువుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు వలలో చిక్కుకుని మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేశారు.

వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడనే హత్య

- సిర్‌పూర్‌లో మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ విఠల్‌రెడ్డి



మద్నూర్‌లో వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

మద్నూర్(జుక్కల్): తమ వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్న భర్తను ప్రియుడితోకలిసి భార్య హతమార్చిన ఘటన డోంగ్లీ మండలం సిర్‌పూర్‌లో చోటుచేసుకుంది. నిందితులను పోలీసులు అరెస్టు చేయగా, మద్నూర్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి, బిచ్కుంద సీఐ రవి, ఎస్సై విజయ్‌కొండ వివరాలు వెల్లడించారు. డోంగ్లీ మండలంలోని సిర్‌పూర్ గ్రామానికి చెందిన మాగిరి రాములు(35)కు భార్య మాదాబాయి, ముగ్గురు కొడుకులు ఉన్నారు. అతడు చేపలు పడుతూ కుటుంబాన్ని పోషించేవాడు. అగస్టు 23 నుంచి రాములు కనబడకుండపోవడంతో అతడి అక్క లక్ష్మీబాయి ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆగస్టు 30న మంజీర నదిలో రాములు మృతదేహం లభ్యమైంది. అదేరోజు సిర్‌పూర్ గ్రామానికి చెందిన ఉప్కల్‌వార్ శంకర్, రాములు భార్య మాదాబాయి ఇద్దరు కలిసి బైక్‌పై మద్నూర్ వైపు వస్తుండగా వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు వారిని విచారించారు. దీంతో రాములును వారే హత్య చేసినట్లు తెలిపారు. మాదాబాయికి శంకర్‌తో వివాహేతర సంబంధం ఉండగా, భర్త అడ్డును తొలగించుకోవాలనుకుంది. ఈక్రమంలో ఆగస్టు 22న రాములుకు శంకర్ ఫుల్లుగా మద్యం తాగించి, సాలూరలోని మంజీర బ్రిడ్జి వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ రాములను అతడు కత్తితో పొడిచి, బ్రిడ్జి పైనుంచి మంజీర నదిలో పడేశాడన్నారు. శంకర్, మాదాబాయి ఇద్దరిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

కొట్టుకొచ్చిన మృతదేహం



కామారెడ్డి క్రైం: కామారెడ్డి పెద్ద చెరువు అలుగు ప్రాంతంలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. కామారెడ్డి పెద్ద చెరువు అలుగు ప్రాంతంలోని చెట్ల పొదల్లో ఓ వ్యక్తి మృతదేహంను స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ప్యాంటు జేబులో ఉన్న ఆధార్ కార్డు, ఇతర ఆనవాళ్లతో మృతుడిని కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన కరివేపాల బాలరాజు (50)గా గుర్తించారు. నెల క్రితం అతడు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాల్లో అతడు గల్లంతై చెరువు వరదలో కొట్టుకుపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రంజిత్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.